సాక్షి వికారాబాద్

గురువారం । 16 । జనవరి । 2025



గాంజా.. పంజా!

కొంతమంది యువత, విద్యార్థులు గంజాయి మత్తులో తూగుతున్నారు. చిన్న విషయాలకే అల్లర్లకు పాల్పడుతున్నారు. 8లో ▸



జంట హత్యల కలకలం

నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాల గూడలో జంట హత్యల ఘటన కలకలం రేపింది. 8లో ▸



జోరుగా కల్తీ..!

కొడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా నకిలీ దందా జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 9లో ▸

న్యూస్‌రీల్

రోగులతో ప్రేమగా మెలగాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్



రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ రవీందర్ యాదవ్

దుద్యాల్: ఆస్పత్రికి వచ్చే రోగులతో ప్రేమగా మెలగాలని.. చికిత్స అందించే విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని వికారాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీందర్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గతంలో ఆస్పత్రి వసతి లేక పేదలు కోస్గి, కొడంగల్, పరిగి, మహబూబ్‌నగర్ వెళ్లేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల ఇతర సిబ్బంది ఉన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు 19న వేలం

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఆర్టీఏ పరిధిలో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 19న వేలం వేయనున్నట్లు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి సుభాష్ చందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. మహేశ్వరం, బండ్లగూడ, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం పరిధిలో పన్నులు చెల్లించని, ఇతర కారణాలతో సీజ్ చేసిన వాహనాలను మన్నెగూడలోని ఆర్టీఏ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనాలనుకునే వారు రూ.500 దరఖాస్తు రుసుము, డిపాజిట్ రూ.2 వేలు చెల్లించాలని సూచించారు. సీజ్ అయిన వాహనాలను యజమానులు తీసుకోవాలనుకుంటే ఈనెల 18లోపు ఆర్టీఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. వేలం వేయనున్న వాహనాల వివరాలు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

యూపీ టు సిటీ

అక్రమంగా ఆయుధాల సరఫరా




స్వాధీనం చేసుకున్న ఆయుధాలు చూపుతున్న పోలీసు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు ఆయుధాలను అక్రమంగా సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. 2 తుపాకులు, 10 బుల్లెట్లు, తపంచాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాచకొండ కమిషనర్ జి.సుధీర్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారంఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ జాదవ్ 2019లో తన అన్న మురళితో కలిసి హైదరాబాద్‌కు వచ్చాడు. బీబీనగర్‌లోని ఓ కంపెనీలో పనిలో చేరాడు. మూడేళ్ల పాటు పనిచేసిన తర్వాత 2022లో ఉద్యోగాన్ని వదిలేసి సొంతూరు రాంపూర్ బోహాకు వెళ్లిపోయాడు. అక్కడే పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. హరేకృష్ణ స్వగ్రామం బిహార్‌కు సరిహద్దు కావడంతో అక్కడ అక్రమంగా ఆయుధాలు తయారు చేసేవారితో ఇతనికి పరిచయాలు ఏర్పడ్డాయి. వ్యవసాయంలో పెద్దగా సంపాదన లేకపోవడంతో అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తక్కు వ ధరకు తుపాకులు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో విక్రయించాలని పథకం వేశాడు. ఈక్రమంలో బిహార్‌లోని షాపూర్ గ్రామానికి చెందిన సంపత్ యాదవ్ నుంచి 3 ఆయుధాలు కొనుగోలు చేశాడు. వీటిని తీసుకొని బుధవారం హైదరాబాద్ వచ్చాడు. జవహర్‌నగర్ ఠాణా పరిధిలోని అంబేడ్కర్ నగర్ బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. సమాచారం అందుకున్న భువనగిరి స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), జవహర్‌నగర్ పోలీసులు హరేకృష్ణ జాదవ్‌ను అరెస్టు చేశారు.

చైనా మాంజా చుట్టుకుని..

బాలుడికి గాయాలు



బంట్వారం: గాలిపటం ఎగురవేస్తున్న బాలుడు చైనా మాంజా కారణంగా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని బొప్పునారంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఆనంద్, లక్ష్మి దంపతుల కుమారుడు ధనుష్ (7) సంక్రాంతి రోజున గాలిపటం ఎగురవేస్తున్నాడు. ఈ క్రమంలో అతడి కాళ్లకు చైనా మాంజా చుట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబీకులు కర్ణాటక రాష్ట్రంలో ని కుంచారం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం తాండూరుకు తరలించారు.

గ్రామ దేవతకు బోనాలు

మండల పరిధిలోని గుంతబాసుపల్లిలో మంగళవారం గ్రామ దేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పంటలు సమృద్ధిగా పండి.. సల్లంగా చూడాలంటూ మొక్కుకున్నారు.

– తాండూరు రూరల్





బోటింగ్ పోటీకి సిద్ధమైన లైఫ్‌గార్డ్స్

సంక్రాంతికి కాయాకింగ్

సంక్రాంతి సందర్భంగా కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద కాయాకింగ్ బోటింగ్ యాజమాన్యం బుధవారం సిబ్బందికి పోటీలు నిర్వహించింది. పర్యాటకుల రక్షణార్థం పని చేస్తున్న లైఫ్‌గార్డులు ఈ పోటీల్లో పాల్గొని తమ సత్తాచాటారు. లక్ష్యాన్ని చేరుకుని ముందుగా తిరిగి వచ్చిన వారికి కాయాకింగ్ బోటింగ్ కోఆర్డినేటర్ రాములు అభినందించి ప్రోత్సాహకాలు అందించారు. ప్రతీ సంవత్సరం పోటీలు నిర్వహిస్తామన్నారు.

– ధారూరు

నెత్తురోడుతున్న రహదారి

ప్రాణాలు హరి

- హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల ప్రాణనష్టం
- నివారణ చర్యలు చేపట్టని అధికార యంత్రాంగం

పరిగి: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి రక్తసిక్తమవుతోంది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. వాహనదారులనుంచి లక్షల రూపాయల్లో ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నా భద్రత మాత్రం అంతంతమాత్రమే. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

అధికారుల తీరుపై విమర్శలు

రెండు వరుసలతో ఎన్‌హెచ్–163 రోడ్డు నిర్మించినప్పటికీ ప్రమాదాలు తగ్గడం లేదు. మన్నెగూడ నుంచి తుంకిమెట్ల వరకు నిత్యం ఏదో ఓ చోట యాక్సిడెంట్ జరుగుతూనే ఉంది. రోడ్డు భద్రతకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. రవాణా శాఖ అధికారులు ట్యాక్స్‌ల వసూలుపై పెట్టిన శ్రద్ధ ప్రమాదాల నియంత్రణపై చూపడం లేదనే అపవాదులున్నాయి. ప్రమాదాలపై స్థానిక పోలీసులు, రోడ్డు రవాణా అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, రాత్రి వేళలో వెలుతురు ఉండేలా



హన్మన్‌గండి సమీపంలో జరిగిన ప్రమాదం (ఫైల్)

చూడడం, యూటర్న్‌లు, మార్కింగ్‌లు, నిరంతరం రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. యాక్సిడెంట్ స్పాట్స్ వద్ద ప్రత్యేక చర్యలు, ఏమైన రోడ్డు నిర్మాణ లోపాలు జరిగాయా, డివైడర్లు ఏర్పాటు తదితర వాటిని పరిశీలించాలి. ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలాంటి సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలనే విషయాలను పోలీసు అధికారులు, ఆర్టీఏ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని. రోడ్డు ప్రమదాల నివారణకు ప్రభుత్వం సైతం రోడ్డు భద్రతా నిధులు విడుదల చేస్తూనే ఉన్నా.. నివారణ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు

పరిగి మండల పరిధిలోని ఇటీవల రోడ్డు ప్రమదాలు పెరిగాయి. ఈ యాక్సిడెంట్స్‌లో ఒక్కరిద్దరి ప్రాణాలు సైతం కోల్పోతూనే ఉన్నారు. పూడూర్ మండలం మన్నెగూడ నుంచి బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం వరకు ప్రతి రోజు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పోలీసులు, సంబంధిత అధికారులు నిమ్మకు నిరెత్తనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

యాక్సిడెంట్ స్పాట్

మండలం	గ్రామాలు
పరిగి	హన్మన్‌గండి, గడిసింగాపూర్, రంగంపల్లి, సాలిపూలబాట తండా
బొంరాస్‌పేట	రేగడిమైలారం, తుంకిమెట్ల

“ చర్యలు తీసుకుంటాం



రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పరిమితికి మించి వేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగానే ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రణ చర్యలు తీసుకుంటాం.

– సంతోష్‌కుమార్, ఎస్‌ఐ, పరిగి



అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అర్హులందరికీ సంక్షేమం

- లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి
- ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి పరిశీలన
- 21 నుంచి 24 వరకు అర్హుల ముసాయిదా
- 25 లోగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు అమలు చేసేందుకు సంకల్పించిందన్నారు. ఈ నాలుగు పథకాల అమలుకు సంబంధించిన విధి విధానాలు, క్షేత్ర స్థాయి పరిశీలన, గ్రామ, వార్డు సభల నిర్వాహణ, లబ్ధిదారుల ఎంపిక తదితర విషయాలను అధికారులకు వివరించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామ సభలు, వార్డు సభల నిర్వాహణకు వెంటనే సన్నాహాలు చేసుకోవాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 16 నుంచి 20వరకు క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయాలని చెప్పారు. ఇందిరమ్మ కమిటీలను భాగస్వామ్యం చేస్తూ 21 నుంచి 24వరకు నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో అర్హుల ముసాయిదా చదివి వినిపించాలన్నారు. అభ్యంతరాలుంటే స్వీకరించి పది రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. 25లోగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు పథకాల అమలుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఐఏబీఎస్‌కు షరతులు

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా(ఐఏబీఎస్) పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడతలుగా (ఒక్కో విడత రూ.6వేల చొప్పున) సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పథకానికి అర్హులుగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలై ఉండి ఉపాధి హామీ పథకం కింద 2023–2024లో కనీసం 20 రోజులు పనిచేసి ఉండాలన్నారు.

కుల గణన సర్వే ఆధారంగా రేషన్‌కార్డు

కుల గణన సర్వే ఆధారంగా తయారుచేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా క్షేత్రస్థాయి పరిశీలనకు మండల స్థాయిలో ఎంపీడీఓలు పట్టణ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు ప్రక్రియకు బాధ్యులని, ఆ తర్వాత జిల్లాస్థాయిలో కలెక్టర్ (రెవెన్యూ అదనపు కలెక్టర్), జిల్లా సివిల్ సప్లై అధికారి పర్యవేక్షకులుగా ఉంటారని చెప్పారు. ముసాయిదా జాబితాను గ్రామసభ/ వార్డు సభలో ప్రదర్శించి చర్చించిన తర్వాత ఆమోదిస్తారని, ఆమోదించిన లబ్ధిదారుల జాబితాను మండల /మున్సిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్ లో నమోదు చేసి జిల్లా కలెక్టర్ కు పంపించాల్సి ఉంటుందన్నారు. ఆ జాబితాను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి చెందితే సీసీఎస్ లాగిన్‌కు పంపుతారని, ఫైనల్ లిస్ట్ ప్రకారం సీసీఎస్ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారని ఆయన తెలిపారు.

స్థలం ఉన్నవారికి తొలిప్రాధాన్యత

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని దారిద్ర్య రేఖకు దిగువన ఉండి స్థలం ఉన్నవారు, అద్దె నివాసంలో ఉండేవారు ఇందిరమ్మ ఇళ్లకు అర్హులని చెప్పారు. ఆర్‌సీసీ, ఇటుక గోడలు లేకుండా రేకుల షెడ్డు,గుడిసెలు ఉన్నవారికి, యువ వితంతువులు, భూమి లేని వ్యవసాయ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులకు ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులై ఉండి సొంత స్థలాలు లేని వాళ్లకు సైతం ఇళ్లు కేటాయించబడతాయన్నారు.

లబ్ధిదారుల వివరాలు సేకరించండి

క్షేత్రస్థాయి పరిశీలనకు షెడ్యూల్ తయారు చేసుకోవాలని.. నిర్వహించే ముందే గ్రామాల్లో టాంటాం వేయించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పంచాయతీల వారీగా ఎంతమందికి రుణమాఫీ, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల అమలయ్యాయో వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వసతిగృహాల్లో, పాఠశాలల్లో మెనూతో పాటు నాణ్యమైన భోజనం అందిచాలని.. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్పాహారంలో సమస్యలుంటే చెప్పాలని కోరారు. విద్యార్థులతో స్వాగత కార్యక్రమాలు నిర్వహించకుండా ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సుధీర్, ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీఈఓ రేణుక దేవి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీబీటీ పద్ధతిలో ‘రైతుభరోసా’

రైతు భరోసా సాయం ఎకరాకు రూ.12వేలకు పెంచారని.. ఇది రెండు విడతలుగా రూ.6వేల చొప్పున డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నగదు జమవుతుందని చెప్పారు. సా గు యోగ్యంగా లేని భూములను పథకం నుంచి తొలగించాలని సూచించారు. ఇళ్లు, కాలనీలుగా మారిన భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్స్, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాంలకు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములు, ప్రభుత్వం సేకరించిన భూ ముల ను, రాళ్లు, గుట్టలతో సాగుకు అనువుగాలేని భూములను వ్యవసాయ యోగ్యం కాని భూ ములుగా గుర్తించాలన్నారు. ఇందుకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డీటీసీపీ లేఅవుట్లు, పెండింగ్ లేఅవుట్‌లను పరిశీలించాలని చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల వ్యసాయ విస్తరణ అధికారి బృందం సాగు యోగ్యం కాని భూములను గుర్తిస్తుందని వివరించారు.

ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్

అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓలు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్క్యులర్ ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేసి ప్రొసీడింగ్స్ అందజేయాలని ఆదేశించారు. ఈ నెల 26న ప్రారంభించనున్న నాలుగు ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎంపీడీఓలు, తహసీల్దార్లు మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకుని గురువారం వరకు లిస్ట్ తయారు చేయాలన్నారు. పూర్తి చేసిన లిస్ట్‌ను సూపర్ చెకింగ్ పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సభలకు బృందాలను ఏర్పాటు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలన్నారు. రుణ మాఫీ, గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలపై గ్రామాలు, వార్డుల వారీగా లిస్ట్ తయారు చేయాలన్నారు. తహసీల్దార్లు కమిటీలు ఏర్పాటు చేసి లిస్ట్ సూపర్ చెకింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.



వివరాలను వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

అమాయకులే టార్గెట్

- ఏటీఎం కార్డులతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా
- డబ్బులు డ్రా చేసి ఇస్తామని దోపిడీలు
- ముగ్గురు దుండగులకు రిమాండ్
- రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: అమాయకులు, మహిళలను టార్గెట్‌గా చేస్తారు.. ఏటీఎంలలో డబ్బులు తీయడం రాని వారిని పరిచయం చేసుకుంటారు.. డబ్బులు తీసిస్తామని దృష్టిమరల్చి ఏటీఎం కార్డు మార్చేసి డూప్లికేట్ కార్డు ఇస్తారు. ఒరిజినల్ కార్డుతో డబ్బులు డ్రా చేసుకుంటారు. ఇటీవల ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ముగ్గురు సభ్యులను బుధవారం షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ విజయ్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు.

ఉపాధి కోసం వచ్చి

బీహార్ రాష్ట్రం ఈస్ట్ చంపారన్, సోనబర్సా గ్రామానికి చెందిన కరిమన్‌సహాని, రూప్‌దేవ్‌సహాని, పంజాబ్ రాష్ట్రం కపుర్తల పగ్వారా గ్రామానికి చెందిన సహేబ్‌సహాని కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం వచ్చారు. కూలీ పనులు చేస్తూ శంషాబాద్ మండలం తొండుపల్లిలో నివాసం ఉంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే పథకం వేసి ఏటీఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్నారు.

15 సార్లు చోరీలు

ఏటీఎం కార్డులు దోపిడీకి పాల్పడుతున్న దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు విచారించగా ఏటీఎంల వద్ద నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. షాద్‌నగర్, ఆర్‌జీఐఏ, పటాన్‌చెరు, శంషాబాద్‌లో రెండేసి చొప్పున, దుండిగల్, సనత్‌నగర్, జడ్చర్ల, గచ్చిబౌలి, జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి, బాలా నగర్ ఏటీఎంల వద్ద ఒక్కోటి చొప్పున మొత్తం 15 దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ.2,38,140 నగదు, డూప్లికే ట్ ఏటీఎం కార్డులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, సైబారాబాద్ ఎస్‌ఓటీ డీసీపీ శోభన్‌బాబు, సీఐ సంజయ్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, విచారణాధికారి డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఐ శరత్‌కుమార్, క్రైం టీం మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీ కేసును ఛేదించారు.

జడ్చర్లలో కేసుతో ఆటకట్టు..

నందిగామ మండలం, శ్రీనివాసులగూడెంకు చెందిన కుమ్మరి రాజు 2024 ఆగస్టు 5న జడ్చర్ల రోడ్డులోని ఐడీబీఎం ఏటీఎంకు వెళ్లాడు. ఈయనకు డబ్బులు తీయడం రాదని గ్రహించిన దుండగులు, అతని వద్దకు వెళ్లి కార్డు మార్చేశారు. కొంతసేపటి తర్వాత తన ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు గుర్తించిన రాజు అదేరోజు షాద్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో ముఠా సభ్యులను పట్టుకున్నారు.

సెలవుల్లోనూ సై అన్నారు!

- రేయింబవళ్లు విధులు నిర్వర్తించిన జలమండలి ఉద్యోగులు
- అభినందించిన ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: పండగ సమయంలోనూ జలమండలి యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి నగరంలోని పలు ప్రాంతాల్లో పైపులైన్ల మరమ్మతు పనులు చక్కబెట్టింది. సంక్రాంతి సెలవులతో కొన్ని శాఖల ఉద్యోగులు కుటుంబ సమేతంగా ఊరెళ్లగా.. మరికొందరు ఇంటి పట్టునే ఉండగా.. జలమండలి ఉన్నతాధికారులు, సిబ్బంది మాత్రం తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. సాధారణ రోజుల్లో రద్దీగా ఉండే నగరంలోని ప్రధాన రహదారులపై సంక్రాంతి పండగ సెలవులతో వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. దీంతో జలమండలి సిబ్బంది ముందస్తు ప్రణాళికతో పైపులైన్ లీకేజీలు, పైపులైన్ల మార్పిడి పనులు చేపట్టి పలు సమస్యలను పరిష్కరించారు. నగరంలో కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, పంజాగుట్ట, మూసాపేట్, బంజారాహిల్స్, జగద్గిరిగుట్ట, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడ్డ లీకేజీలు, సీవరేజ్, ఇతర సమస్యలను రాత్రి, పగలు తేడా లేకుండా పని చేశారు.

పనులు ఇలా..

రెండు రోజుల పాటు రాత్రి సమయాల్లోనూ రోడ్ క్రాసింగ్ పనులు నిర్వహించారు. మూసాపేట, కేపీహెచ్‌బీ పరిధిలోని ఫోరం మాల్ సర్కిల్ దగ్గర సీవరేజీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. మూసాపేట్‌లోని ఆంజనేయనగర్‌లో సీవరేజీ పైపులైన నిర్మాణ పనులు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్–10 లో ఏర్పడిన లీకేజీని అరికట్టారు. జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ విగ్రహం వద్ద లీకేజీని కట్టడి చేశారు. ప్రగతినగర్‌లో నీటి సరఫరా పెంచడానికి గ్యాప్ క్లోజర్ పనులు నిర్వహించారు. పంజాగుట్ట క్రాస్ రోడ్స్‌లో సీవరేజ్ పైపులైన్ డ్యామేజీ కావడంతో దానికి మరమ్మతులు నిర్వహించారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ప్రధాన రహదారులపై చేపట్టిన పనులు సంబంధిత సర్కిళ్ల జీఎంలు, సెక్షన్ల మేనేజర్లు పరిశీలించారు. నగరంలోని రోడ్లు ఖాళీగా ఉండటం పనులకు మరింత కలిసి వచ్చినట్లయింది.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏడుగురిపై కేసు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ శ్రీశైలంయాదవ్

బంట్వారం: పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల పరిధిలోని బొప్పునారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన ప్రకారం.. గ్రామంలో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5వేల నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాదిగలపై వివక్షత వద్దు

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ

బొంరాస్‌పేట: మాదిగలపై వివక్ష చట్టరీత్యా నేరమని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని బొంరాస్‌పేట, ఏర్పుమళ్లలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుభాష్ మాదిగ మాట్లాడుతూ.. మాదిగలను చైతన్యం చేయడంతోపాటు ఎమ్మార్పీఎస్ బలోపేతం చేసే క్రమంలో ఎన్నో బాధాకర సంఘటనలు బయటపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏర్పుమళ్లలో కొన్ని రోజులుగా మాదిగలకు క్షవరాలు చేయడం లేదని గ్రామంలో అలజడి రేగుతున్నా ఎవరు పట్టించుకోలేద న్నారు ఇప్పటికైనా పోలీసులు, గ్రామస్తులు వివక్షతకు తావివ్వకుండా సహకరించాలఅన్నారు. మాదిగలపై ఎక్కడ వివక్షత చోటుచేసుకు న్నా జిల్లా ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గ్రామ కమిటీల ఏర్పాటు

ఏర్పుమళ్ల గ్రామ అధ్యక్షుడిగా ఈశ్వర్, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా మునికుమార్, సహాయ కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా శ్రీను, సలహాదారులుగా రామయ్య, బందెయ్య, ప్రేమయ్య, ఈశ్వరయ్య, కళాకారులుగా చెన్నయ్య, చంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొంరాస్‌పేట గ్రామకమిటీ అధ్యక్షుడిగా రాజు, ఉపాధ్యక్షుడిగా మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, కోశాధికారిగా బాబు, కార్యనిర్వహణ అధ్యక్షుడు పెంటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, కో కన్వీనర్ జనార్ధన్, లక్ష్మణ్, వెంకటయ్య, యేసు, ప్రభు, సాయిలు, రాజేశ్, చిన్నకాశప్ప, శివరాజు, వెంకటయ్య తదితరులున్నారు.

'వెయ్యి గొంతులు–లక్ష డప్పులు'ను విజయవంతం చేద్దాం

యాలాల: వచ్చే నెల 7న జరగనున్న వెయ్యి గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమానికి దళితులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు డప్పు మహేందర్ కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దళితుల ఐక్యతను చాటేందుకు చేపట్టిన కార్యక్రమానికి మండలంలోని గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు భారీగా హాజరు కావాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి

యాచారం: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, యాచారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు దశరథగౌడ్(65) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో కన్నుమూశాడు. ఉమ్మడి ఏపీలో హోం మంత్రిగా పనిచేసిన టి.దేవేందర్‌గౌడ్ ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందాడు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. దశరథగౌడ్‌కు భార్య, ముగ్గురు కుమారులున్నారు. పలువురు నాయకులు యాచారంలోని నివాసంలో దశరథగౌడ్ మృతదేహానికి నివాళులర్పించారు.



బడంగ్‌పేట్: కొంతమంది యువత, విద్యార్థులు గంజాయి మత్తులో ఊగి, తూగుతున్నారు. పిచ్చి పట్టినట్లు వ్యవహరిస్తూ చిన్న విషయాలకే అల్లర్లకు పాల్పడుతున్నారు. దీంతో బాలాపూర్ మండలం, బడంగ్‌పేట కార్పొరేషన్ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గంజాయి అమ్మకం, రవాణాను కట్టడి చేయాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అడ్డాలు అనేకం..

బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని సీకేఆర్ కేటీఆర్ ఫంక్షన్ హాల్ వెనకాల, రాఘవేంద్ర కాలనీ, మౌంట్ కార్మెల్ స్కూల్ సమీపంలోని నూతనంగా వెలిసిన వెంచర్లల్లో, 119 సర్వేనంబర్, భీష్మనగర్ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతం, సాయిబాలాజీనగర్, మునిసిపల్ కాలనీల మధ్య ఉన్న ఓపెన్ స్థలాలు, బాలాపూర్, ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వెనకాల ఉన్న వెంచర్, దీని పరిసర ప్రాంతాల్లో, స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ, అల్మాస్‌గూడ, జేఎన్ఎంయూఆర్ఎం నివాస గృహాల వద్ద, నాదర్‌గుల్‌లోని మర్రి లక్ష్మమ్మ వెంచర్ పరిసరాల్లో.. ఇలా చెప్పుకుంటూ పోతే మనుషుల రాకపోకలు తక్కువగా ఉండే ప్రాంతాలను అడ్డాగా చేసుకుని యువత, విద్యార్థులు మత్తులో జోగుతూ.. కేరింతలు కొడుతున్నారు.

విద్యార్థులే టార్గెట్

బడంగ్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనకాల విద్యార్థులను టార్గెట్ చేసుకుని గంజాయి విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. గుర్రంగూడలో కొంత విద్యార్థులను (6నుంచి 10 తరగతులు) గంజాయి ముఠా సభ్యులు టార్గెట్ చేస్తున్నారు. ఈ దారిలో రాకపోకలు సాగిస్తున్న వారితో గంజాయి తాగిస్తూ క్రమంగా వారిని బానిసలుగా చేస్తున్నారని సమాచారం. పలు ఇంజనీరింగ్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు కాలేజీలకు డుమ్మా కొడుతూ.. గంజాయి మత్తులో గడిపేస్తున్నారు.

అవగాహన

సినీ స్టార్లు, ఎంతో మంది ప్రముఖులతో ప్రభుత్వం ప్రకటనలు చేయిస్తోంది. ఎవరూ మత్తుకు బానిస కావద్దని, తాగుడు, గంజాయి, డ్రగ్స్‌కు బానిసైన వారిని రిహాబిలిటేషన్ సెంటర్లో చేర్పించి, మార్పునకు కృషి చేసేందుకు ప్రయత్నిస్తోంది. కానీ మత్తుకు బానిసైనవారితో పాటు ఇళ్లలో, పరిసరాల్లో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు ముందుకురాకపోవడం బాధాకరం.

చిన్న ప్యాకెట్లుగా విక్రయం

మీర్‌పేట్, బాలాపూర్, పహాడీషరీఫ్, ఆదిబట్ల ఠాణాల పరిధిలో పెద్ద మొత్తంలో గంజాయి సరఫరా చేస్తున్న కొంతమంది సభ్యులను పోలీసులు అనేక సార్లు పట్టుకున్నారు. దీంతో గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. కొంతమంది ఆటోవాలాలకు గంజాయి అలవాటు చేయించి, వారితో సరఫరా చేయిస్తున్నారు.

❖ చెప్పేవారే లేరు..

మత్తులో బైకులు, కార్లు తీసుకెళ్తున్న యువత అతి వేగం, ర్యాష్ డ్రైవింగ్‌తో రోడ్లపై భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. గంజాయి సేవిస్తున్న ముఠాల వద్దకు వెళ్లాలన్నా, స్థానిక యువతకు చెప్పాలన్నా అందరూ తెలిసిన వాళ్లే కావడంతో ఇటు పోలీసులు, అటు ప్రజాప్రతినిధులు వెనకడుగు వేస్తున్నారు. పది రోజుల క్రితం గంజాయి మత్తులో వచ్చిన ఓ యువకుడు బార్‌లోకి ప్రవేశించి వెయిటర్‌పై దాడి చేయడంతో 30కి పైగా కుట్లు పడి ప్రాణాలతో బయటపడ్డారు. మత్తులో జోగుతున్న యువత, ఎదురుదాడులకు దిగుతున్నా.. ఇది తప్పు అని నచ్చజెప్పేందుకు ఎవరూ సాహసించడం లేదు. దారి వెంట వెళ్లే యువతులు, బాలికలపై దాడులు చేస్తుండటం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

తల్లిదండ్రుల్లో ఆందోళన

చేతికొచ్చిన కొడుకులు, బిడ్డలు రోజు మత్తులో జోగుతుంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. గంజాయికి బానిసైన వారితో స్నేహం చేస్తున్న అమాయక యువత, విద్యార్థులు మెల్లగా ఆ ఉచ్చులోకి దిగుతున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలతో పాటు పరిసర ప్రాంతాల వారి దుస్థితిని చూసి పేరెంట్స్ కన్నీరుమున్నీరవుతున్నారు.



గంజాయి పీలుస్తూ మత్తులో జోగుతున్న యువత



అంతా ఏకమైతేనే కట్టడి

ప్రభుత్వం, పోలీసులపైనే భారం మోపకుండా అంతా ఏకమై పోరాటం చేస్తేనే గంజాయి కట్టడి సాధ్యమవుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనను ఎప్పుడూ గమనిస్తుండాలి. బెల్టు షాపులు ఎత్తివేయించి, యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు గురికాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి. కుల, మత ప్రచారాలకంటే సమాజం నుంచి మత్తును పారదోలే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– ఇబ్రాం శేఖర్, డిప్యూటీ మేయర్, బడంగ్‌పేట్

పుప్పాలగూడలో జంట హత్యల కలకలం

కత్తులతో పొడిచి.. బండరాళ్లతో మోది ఇద్దరి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే ప్రాణాలు తీసిందా?
- నిందితుల కోసం పోలీసుల వేట



బిందు



అంకిత్ సాకేత్ (ఫైల్)

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో జంట హత్యల ఘటన కలకలం రేపింది. వివాహితను, ఆమె ప్రియుడిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. మంగళవారం గాలిపటాలు ఎగురవేసేందుకు పద్మనాభ స్వామి గుట్టల వైపు వెళ్లిన యువకులకు అక్కడ రెండు మృతదేహాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించడంతో జంట హత్యల ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బేమెతరా జిల్లా నమాగఢ్‌కు చెందిన బిందు బింజారె (27)కు, ఇదే రాష్ట్రం ముంగిలి జిల్లా బయక్‌కాంప గ్రామానికి చెందిన వ్యక్తితో పదకొండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బిందు కుటుంబం బతుకుదెరువు కోసం కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలోని ఓ విల్లా ప్రాజెక్ట్‌లో మేస్త్రీ, కూలీలుగా భార్యాభర్తలు కొంత కాలం పని చేశారు. అనంతరం వనస్థలిపురం వచ్చారు.

ప్రియుడి మోజులో పడి.. కుటుంబాన్ని వదిలి..

గతంలో శంకర్‌పల్లి సైట్‌లో పని చేసినప్పుడు బిందుకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంకిత్ సాకేత్ (27) ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. ప్రియుడి మోజులో పడిన బిందు తన కుటుంబాన్ని వదిలేసి ఈ నెల 4న అంకిత్ సాకేత్ ఉంటున్న నానక్‌రాంగూడకు వచ్చేసింది. తన వద్దకు వచ్చిన బిందును సాకేత్ తన స్నేహితుల గదిలో ఉంచాడు. ఈ క్రమంలో తన భార్య బిందు కనిపించడంలేదంటూ భర్త ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అదే రోజు పిల్లలను తీసుకుని స్వస్థలానికి వెళ్లిపోయాడు. నిర్మానుష్య ప్రదేశంలో శవాలుగా బిందు, అంకిత్ సాకేత్.. నానక్‌రాంగూడలో ఉంటున్న అంకిత్ సాకేత్ కనిపించటం లేదని ఆయన తమ్ముడు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న ఫిర్యాదు చేశాడు. కాగా.. పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని నిర్మానుష్య ప్రదేశమైన పద్మనాభస్వామి ఆలయ పరిసరాల్లోని గుట్టల్లో బిందు, సాకేత్ మృతదేహాలు స్థానికులకు కనిపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు వీరిని కత్తులతో పొడిచి, ముఖాలు గుర్తించకుండా బండరాళ్లతో మోది దారుణంగా హత్య చేశారు. జంట హత్యలు ఈ నెల 11, 12 తేదీల్లో జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భిన్న కోణాల్లో విచారణ ముమ్మరం..

జంట హత్యల ఘటనా స్థలాన్ని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి ఏసీపీ రమణగౌడ్, నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిలు మంగళవారం పరిశీలించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్‌లతో వివరాలు సేకరించారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. బిందు, అంకిత్ సాకేత్‌లతో పాటు మరో ముగ్గురు అటుగా వెళ్లినట్టు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బిందును గదిలో ఉంచిన సాకేత్ మిత్రులా? లేదా గతంలో శంకర్‌పల్లిలో పని చేసిన సమయంలో బిందుతో పాటు పని చేసిన వారా? లేక ఇతరులెవరైనా వారిని అక్కడ చూసి అఘాయిత్యానికి పాల్పడ్డారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి శరీరం కింది భాగంలో దుస్తులు లేకపోవటంతో అత్యాచారం చేసి హతమార్చారా? బిందు, సాకేత్ ఏకాంతంగా ఉన్న సమయంలో హత్య చేశారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలం సమీపంలో సుమారు 10 ఖాళీ బీరు సీసాలు ఉన్నాయి. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బుధవారం సాయంత్రం మృతుల బంధువులకు అప్పగించారు.



ఘాట్‌రోడ్డు మలుపులో బోల్తాపడిన సిమెంట్ ట్యాంకర్



స్పృహతప్పిన డ్రైవర్

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు

ధారూరు: ఘాట్ రోడ్డు మలుపులో ఓ సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండల పరిధిలోని ఎబ్బనూర్ చెరువు సమీపంలోని మొదటి ఘాట్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. హైదరాబాద్ నుంచి తాండూరు సమీపంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీకి వస్తున్న ట్యాంకర్ బుగ్గ టెంపుల్ మీదుగా ధారూరు వైపు వెళ్తోంది. మొదటి ఘాట్ మలుపు వద్ద వాహనం అదుపుతప్పి పక్కనే గుంతలో పడిపోయింది. దీంతో డ్రైవర్ విలాస్ యాదవ్ తీవ్రగాయాలతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

వాటర్ బాటిల్ అనుకుని యాసిడ్ తాగి వ్యక్తి మృతి

మియాపూర్: వాటర్ బాటిల్ అనుకుని రోడ్డుపై పడి ఉన్న యాసిడ్ తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, శెట్టి బలిజపేట గ్రామానికి చెందిన రాయుడు వెంకట సత్య సూర్యనారాయణ(41) కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌పేట్ మార్తాండ నగర్ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కూలి పనికి వెళ్లిన రాయుడు వెంకట సత్య సూర్యనారాయణ మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా హాఫీజ్‌పేట్ రోడ్డు సమీపంలో రోడ్డుపై పడి ఉన్న బాటిల్ తీసుకుని నీళ్ల అనుకుని యాసిడ్ తాగాడు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే నోట్లో నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాయుడు గోవింద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇందూరు యువత క్రీడాకారులకు ఆదర్శం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

తాండూరు రూరల్: క్రికెట్‌లో రాణిస్తున్న ఇందూరు యువత క్రీడాకారులకు ఆదర్శమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. పెద్దేముల్ మండలం ఇందూరులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఇందూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ధారాసింగ్ విజేత జట్టు ఇందూరు రాయల్ వారియర్స్ జట్టుకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి, ఉత్తమ్ చందు, నరేందర్, ప్రకాషం, రాంరెడ్డి, మల్లేశం, మహిపాల్‌రెడ్డి, లొంక నర్సింలు, బందెప్ప, అంజిలప్ప, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

కోటబాసుపల్లిలో..

తాండూరు మండలం కోటబాసుపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో వెంకట్రాంరెడ్డి టీంకు మొదటి బహుమతి, నందు టీంకు రెండో బహుమతి గెలుచుకున్నారు. ఈ టీర్లకు బుధవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, నాగర్జున, శ్రీధర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి ఉన్నారు.



తాండూరు రూరల్: రాయల్ వారియర్స్‌కు బహుమతి అందజేస్తున్న ధారాసింగ్

క్రీడలతో మానసికోల్లాసం

పరిగి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. మండల పరిధిలోని నస్కల్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఉపకరిస్తాయన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం చూపే వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

గుర్తు తెలియని యువకుడి దారుణ హత్య

కుషాయిగూడ: గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం చర్లపల్లి ఠాణా పరిధిలో వెలుగులోకి వచ్చింది. సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. చర్లపల్లి, ఫుకట్‌నగర్ దారిలో ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందిచారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది హత్య చేసినట్లు గుర్తించారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉండవచ్చునని, ఘటనా స్థలం వద్ద అతడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటో బోల్తా.. వ్యక్తి దుర్మరణం

- సురంగల్‌లో ప్రమాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు

మొయినాబాద్: ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సురంగల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్ల ప్రవీన్‌కుమార్ అలియాస్ పెంటయ్య(41) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 5గంటల సమయంలో మొయినాబాద్ నుంచి సురంగల్ వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ఆటోను రోడ్డు దింపాడు. అనంతరం రహదారిపైకి ఎక్కిస్తుండగా అదుపుతప్పిన ఆటో బోల్తా పడింది. ప్రవీన్ ఆటో కింద పడటంతో తల, పొట్ట భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వచ్చి చికిత్స కోసం అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ప్రవీన్‌కుమార్(ఫైల్)

ఆర్మీపై ఆసక్తి అభినందనీయం

- పరిగి డీఎస్పీ శ్రీనివాస్
- ముగిసిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

కుల్కచర్ల: యువత ఆర్మీ ఉద్యోగాలపై ఆసక్తి చూపడం అభినందనీయమని పరిగి డీఎస్పీ శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బండవెల్కిచర్లలో లక్ష్మారెడ్డి స్మారకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం, ఓపిక, సహనం పెంపొందుతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ప్రత్యేక కోటా ఉంటుందని సూచించారు. బండవెల్కిచర్ల నుంచి సుమారు 60 మంది యువత ఆర్మీ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం టోర్నీలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన షాద్‌నగర్, బండివెల్కిచర్ల, వికారాబాద్, ముజాహిద్‌పూర్ గ్రామాల జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు, పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, మోహన్‌రెడ్డి, తిరుపతి, కృష్ణ, గోవర్దన్ రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి,వెంకటయ్య, ఆనందం, దామోదర్ రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు



రోటిబండ తండాలో గ్రామం ముఖద్వారం వద్ద ముగ్గు వేసి నిరసన తెలుపుతున్న గిరిజనులు



ఓ బాధితుడి ఇంటి ఎదుట

రంగవల్లిలో లగచర్ల లొల్లి

సంక్రాంతి కాంతులు రోటిబండా, నులిచర్లకుంట తండాల్లో కనిపించలేదు. లగచర్ల ఘటనతో గిరిజనులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన విషయం తెలిసిందే. దీంతో తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని రోటిబండ తండావాసులు డిమాండ్ చేశారు. పులిచర్లకుంట తండా, రోటిబండ తండా గ్రామాల్లో వేసిన ముగ్గుల్లో శుభాకాంక్షలకు బదులుగా.. లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలనే నినాదం రాసి నిరసన వ్యక్తం చేశారు.

– దుద్యాల్